ఇంటి నుంచే ఓటు

- ప్రత్యేక అవకాశం కల్పించిన ఎన్నికల సంఘం
- వృద్ధులు, దివ్యాంగులకు వెసులుబాటు
- పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం
- నియోజకవర్గంలో 2,602 మంది వయోవృద్ధులు, దివ్యాంగులు

ఓటు వేయాలనే ఆసక్తి ఉన్నా వయోభారంతో ఇల్లు కదల్లేని వారికి, దివ్యాంగులకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక అవకాశాన్ని కల్పించింది. ఓట్ ఫ్రం హోం పద్ధతిలో వీరు తమ ఓటు హక్కును ఇంటి నుంచే వేసే వెసులుబాటు ఇచ్చింది. ఉపయోగించుకోవాలనుకునే వృద్ధులు, దివ్యాంగులు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వారంలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 'ఫార్మ్ 12డీ' నింపి రిటర్నింగ్ అధికారికి లేదా సహాయ రిటర్నింగ్ అధికారికి పంపించాలి. ఈ విధానంతో పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది.



ఆలూరు రూరల్: రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో దివ్యాంగులు, వయోవృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. తొలిసారి తీసుకొచ్చిన ఈ విధానాన్ని వృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం ఉన్న ఓటర్లు వినియోగించుకోవచ్చు. అలాంటి వారు నామినేషన్ల నోటిఫికేషన్ జారీ చేసిన వారం రోజుల్లోగా ఫారం -12డీలో వివరాలు నింపి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి అందజేయాలి. దీంతో వారికి ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అకాశాన్ని కల్పిస్తారు. ఈ విధానంతో పోలింగ్ బూత్‌ల వద్ద కలిగే ఇబ్బందుల నుంచి వృద్ధులు, దివ్యాంగులకు ఉపశమనం లభిస్తుంది.

ఆలూరు నియోజకవర్గంలో 2,602 మంది

ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 2,56,528 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,27,651 మంది మహిళలు, 1,28,825 మంది పురుషులు, 52 మంది ఇతరులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందులో 1,506 మంది వయో వృద్ధులు, 1,096 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారు. గత ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బంది పడ్డారు. కేంద్రానికి వెళ్లలేని పరిస్థితిలో ఓటు వినియోగించుకోలేకపోయారు. వారి ఇబ్బందులను గుర్తించిన కేంద్ర ఎన్నికల సంఘం ఈసారి వంద శాతం పోలింగ్ లక్ష్యంగా తొలిసారిగా ఇంటి నుంచి ఓటు వేసే విధానాన్ని ప్రవేశపెట్టింది. ఎవరైనా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేస్తామంటే వారికి ఫారం-12 డీ అవసరం లేదు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయవచ్చు.

ఆలూరు నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

మొత్తం ఓటర్లు	-	2,56,528
మహిళలు	-	1,27,651
పురుషులు	-	1,28,825
ఇతరులు	-	52
వయోవృద్ధులు	-	1506
దివ్యాంగులు	-	1096

ఇంటి నుంచే ఓటు వేయవచ్చు



సార్వత్రికల్లో ఎన్నికల్లో తొలిసారి ఎన్నికల సంఘం 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు కల్పించింది. పోలింగ్ కేంద్రాల వద్ద వారికి కలిగే ఇబ్బందుల దృష్ట్యా ఈ అవకాశాన్ని కల్పించింది. ఇంటి నుంచే ఓటు వేసేవారు నోటిఫికేషన్ వచ్చిన వారంలోగా వారి పరిధిలోని బీఎల్‌ఓకు ఫారం -12డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారు ఇంటి నుంచే రహస్యంగా ఓటు వేయవచ్చు.

–రాము నాయక్, ఆలూరు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి

ఎలా దరఖాస్తు చేసుకోవాలి

- ఫార్మ్ 12డీని ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- ఎన్నికల్లో ఇంటి నుంచే ఓటు వేయాలనుకునే వారికి బూత్ లెవల్ అధికారులు ఫారం-12డీ ఇస్తారు.
- దరఖాస్తు చేసుకునేవారు తాము ఏ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వారో అందులో చెప్పాలి. తమ పూర్తి చిరునామా, సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ పొందుపరచాలి.
- అలాగే ఓటర్ లిస్ట్‌లో తమ పేరు ఏ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉంది, సీరియల్ నంబర్ ఎంత అనేది కూడా నింపాలి.
- వృద్ధులైతే తమ వయసు పేర్కొనాలి. డిజేబుల్డ్ పర్సన్స్ అయితే 'పర్సన్ విత్ డిజెబిలిటీ' అనేది టిక్ చేయాలి.
- నింపిన 'ఫార్మ్ 12డీ' దరఖాస్తును నోటిఫికేషన్ వచ్చిన వారంలోగా రిటర్నింగ్ అధికారి/సహాయ రిటర్నింగ్ అధికారికి చేరేలా చూడాలి.
- అన్ని పరిశీలించిన తర్వాత ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

గరుడవాహనంపై శ్రీరంగనాథుని వైభవం



గరుడ వాహనంపై దర్శనమిస్తున్న శ్రీవారు

మద్దికెర: పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అష్టోత్తరనామార్చన తదితర పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మల్లికార్జున ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దేవుడి రథాన్ని కానుకగానే ఇచ్చాం

ఎమ్మిగనూరురూరల్: దేవుడికే శఠగోపం అని 'ఆంధ్రజ్యోతి' లో వచ్చిన కథనాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు సోమవారం ఖండించారు. గ్రామంలో 2017లో శ్రీఆంజనేయస్వామికి ఇనుప రథం చేయించామని, అది వర్షానికి తుప్పు పట్టి విరిగిపోతుందని గ్రామ పెద్దలు అందరూ కలిసి రూ. 45 లక్షలతో 2021లో చెక్క రథాన్ని చేయించినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఏటా కార్తీక మాసంలో చెక్క రథాన్ని లాగుతున్నామని చెప్పారు. ఇనుప రథం తుప్పు పడుతుందని భావించి గ్రామ పెద్దల నిర్ణయం మేరకే గోనెగండ్ల మండం ఆగ్రహారంలోని శ్రీఈశ్వర స్వామి దేవాలయానికి దానంగా ఇచ్చామని చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా అవాస్తవాలను అంటగట్టడం మంచిది కాదని హితువు పలికారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎస్‌ఐ తిమ్మయ్య

నందవరం: అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. నందవరం మండల పరిధిలోని నాగలదిన్నె పోలీస్ చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేశామన్నారు. ఎమ్మిగనూరు మండలం కె.తిమ్మాపురం గ్రామానికి చెందిన బోయ నల్లబోతుల నాయుడు కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. 288 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

తుగ్గలి: మండల పరిధిలోని రామలింగాయపల్లెలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు జొన్నగిరి ఎస్ రామాంజనేయులు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన మోట తిరుపాలమ్మ కర్ణాటకు చెందిన 25 టెట్రాప్యాకెట్లు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న స్పెయిన్ దేశస్తురాలు

తుగ్గలి: స్పెయిన్ దేశస్తుల సహకారంతో పగిడిరాయి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పేద విద్యార్థులకు రూ.5లక్షల విలువైన 68 సైకిళ్లను సోమవారం పంపిణీ చేసినట్లు ఆర్డీటీ సంస్థ రీజినల్ డైరెక్టర్ రామేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ స్థాపించిన ఆర్డీటీ సంస్థ నిరుపేదల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తోందని చెప్పారు. చదువుకు పేదరికం అడ్డు రాకూడదనే ఉద్దేశంతో దాతలు సైకిళ్లు పంపిణీ చేశారన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సైకిళ్లు అందించిన స్పెయిన్ బృందానికి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్డీటీ ఏటీఎల్ రెహనాబీ, సభ్యులు వెంకటేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ ఓబులేసు

ఆలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఓబులేసు అన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు సోమవారం ఆలూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లు, బైండోవర్ కేసులు ఉన్న వ్యక్తులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లకు పాల్పడడం, గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేయడం, సారా, మద్యం విక్రయించడం, సరఫరా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

గోనెగండ్ల: ఎన్నికల సమయంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రామకృష్ణయ్య హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో గొడవలు సృష్టించడం, ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరింపులకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వారిపై నిఘా ఉంటుందని తెలిపారు. ఎన్నికల నిబంధనలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే అందరూ సహకరించాలని కోరారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ఆలయానికి 101 కేజీల గంట వితరణ



వీరభద్రస్వామికి భక్తుడు అందజేసిన గంట

ఆస్పరి: మండలంలోని కైరుప్పల వీరభద్రస్వామి ఆలయానికి చిరుమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన వీరయ్య స్వామి కుటుంబ సభ్యులు 101 కేజీల గంటను సోమవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కైరుప్పల గ్రామంలో గంటను మేళతాళాల మధ్య ఊరేగించి వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.



ఎమ్మిగనూరు 20వ వార్డులో ప్రచారం చేస్తున్న బుట్టా రేణుక

వైఎస్సార్‌సీపీ పాలనలో పేదల కష్టాలు దూరం

- వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక
- 20వ వార్డులో విస్తృత ప్రచారం

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఆ పార్టీ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక అన్నారు. సోమవారం పట్టణంలోని 20వ వార్డులో ఇంటింటి ప్రచారం చేశారు. వార్డు కౌన్సిలర్ బంగి ప్రమీల, వార్డు ఇన్‌చార్జ్ బంగి శ్రీరాం, టౌన్ బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్‌తో కలిసి ప్రతి గడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. సిఫార్సులతో పనిలేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. పొరపాటున చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి జగనన్న సంక్షేమ పథకాలు ఎత్తివేస్తారని తెలిపారు. మరోసారి మోసపూరిత హామీలతో టీడీపీ నేతలు ఓట్ల కోసం వస్తారని.. వారిని నమ్మి మోసపోవద్దన్నారు. సంక్షేమ పథకాలతోపాటు పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నాగేషప్ప, శివప్రసాద్, అమాన్, నీలకంఠ, రాజారత్నం, సుధాకర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య బుట్టా శివనీలకంఠ, బుట్టా ప్రతుల్, నాయకులు నాగేష్, సునీల్‌కుమార్, కోటకొండ నరసింహులు, సోమేష్, విశ్వనాథ్ రమేష్, కె.విశ్వనాథ్, చంద్రశేఖర్, గోకారి, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు తగవు

ఎమ్మిగనూరుటౌన్: ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడంలో నిస్వార్థంగా పనిచేస్తున్న వలంటీర్లపై శ్రీకాళహస్తి టీడీపీ నేత బొజ్జల సుధీర్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని వైఎస్సార్ సీపీ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ప్రజా సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్ ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థతో బడుగు, బలహీన వర్గాలతో పాటు అన్ని వర్గాలకు ఎంతో మేలు చేకూరుతోందని తెలిపారు. టీడీపీ మాత్రం వలంటీర్ల సేవలపై అవాస్తవాలను ఆపాదించడం పద్ధతి కాదన్నారు. వారిని టెర్రరిస్టులతో పోల్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు డబ్బిచ్చిన వారికే సంక్షేమ పథకాలు అందించేవని ఆరోపించారు. నేడు ప్రతి నెలా ఒకటో తేదీ వలంటీర్లు తలుపుతట్టి పింఛన్లు అందజేస్తూ ప్రజల మన్ననలు పొందుతుండడాన్ని టీడీపీ జీర్ణించుకోలేకపోతుందన్నారు. వలంటీర్ల సేవలను అభినందించాలే కాని టెర్రరిస్టులని చెప్పడం తగదని హితవుపలికారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

వలంటీర్లను అవమానించడం దారుణం

పత్తికొండ రూరల్: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సేవలందిస్తున్న వలంటీర్లను టీడీపీ నాయకులు అవమానించడం బాధాకరమని ఎంపీపీ నారాయణదాస్ అన్నారు. పత్తికొండలోని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గృహంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నేత బొజ్జల సుధీర్ వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. వలంటీర్లు అంటేనే టీడీపీకి భయం పట్టుకుందన్నారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు నాగరాజు, సోమశేఖర్, టీఎండీ హుసేన్, శ్రీనివాసులు, కురాల హుసేన్, వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

వలంటీర్లపై అంత అక్కసేల

వెల్దుర్తి(కృష్ణగిరి): ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్లంటే టీడీపీ నాయకులకు అంత అక్కసు, భయమెందుకని వెల్దుర్తి జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి అనకల బాలాజీ ప్రశ్నించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ నేతల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

హోలీ.. ఆనందాల కేళి



కోయిలకొండలో చిన్నారుల సందడి



పత్తికొండలో ఆనందోత్సాహం



మద్దికెర: రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

కృష్ణగిరి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. చిన్నాపెద్దా తేడాలేకుండాకులమతాలకు అతీతంగా రంగులు చల్లుకుని సంబరాలు చేసుకున్నారు.

పత్తికొండ రూరల్: పత్తికొండతో పాటు జీవరాళ్లమలతండా, పెండ్లిమాన్‌తండా, బుగ్గతండా వాసులు హోలీ పండుగ సందర్భంగా ముందుగా కులదైవానికి పూజలు చేశారు. అనంతరం ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని సందడి చేశారు.

హోలీ సంబరాలు

మద్దికెర/నందవరం: మద్దికెర, నందవరం మండలంలోని జోహరాపురం, నాగలదిన్నె, ముగతి, కనకవీడు, హాలహర్వి తదితర గ్రామాల్లో హోలీని ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నారులు, మహిళలు ఒకరిపై ఒకరూ రంగులు చల్లుకుంటూ ఆనందంతో మునిగితేలారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

గోనెగండ్ల: మండల పరిధిలోని నెరుడుప్పల గ్రామంలో బోయ చిన్న రాముడుపై దాడిన చేసిన నలుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. బోయ చిన్న రాముడు గ్రామంలో ఇల్లు కట్టుకుంటున్నాడు. అయితే సోమవారం ఉదయం మట్టిని ట్రాక్టర్‌లో తీసుకెళ్లే సమయంలో ఇంటి పక్కన ఉన్న నాపరాతి బండకు ట్రాక్టర్ తగిలి బండ పగిలిపోయింది. బండను ఎట్లా పగులకొడతారంటూ బోయ కేశన్న, వెంకటేష్, మల్లికార్జున, జయమ్మ చిన్న రాముడితో గొడవపడ్డారు. చిన్న రాముడుపై నలుగురు కర్రలతో దాడి చేయగా తలకు రక్త గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పౌర్ణమి పూజలు



అలంకరణలో గాయత్రీదేవి

ఆస్పరి: మండల కేంద్రం సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీదేవి ఆలయంలో సోమవారం పౌర్ణమి పూజలు నిర్వహించారు. రూపా మోహన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమ పూజలు, మంగళహారతి తదితర కార్యక్రమాలు చేశారు.

బైక్ దగ్ధం



కాలిపోయిన బైక్

దేవనకొండ: షార్ట్ సర్క్యూట్‌తో బైక్ దగ్ధమైన ఘటన సోమవారం దేవనకొండ-నేలతలమరి రోడ్డులో చోటుచేసుకుంది. మండలంలోని నేలతలమరి గ్రామానికి చెందిన రంగస్వామి గుంతకల్ నుంచి స్వగ్రామమైన నేలతలమరి గ్రామానికి బైక్‌పై వెళుతుండగా ఒక్కసారిగా మంటలు వచ్చాయి. భయాందోళనకు గురై బైక్ నుంచి పక్కకు దూకాడు. కొద్ది సమయానికే బైక్ మొత్తం మంటలు వ్యాపించి పూర్తిగా కాలిపోయింది.

వైభవంగా రథోత్సవం



నోటికి శూలాన్ని గుచ్చుకుని వెళుతున్న భక్తులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సుబ్రమణ్య స్వామి ఆలయంలో సోమవారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తమిళ భక్తులు నోటికి త్రిశూలాలను గుచ్చుకుని, వీపుకు ఎనుప కొక్కిలు తగిలించుకుని రథాన్ని లాగి భక్తిభావాన్ని చాటారు. కావళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంతో డీఎస్పీ

చిప్పగిరి: రామదుర్గం గ్రామంలోని నగరడోణ కొండల్లో నిల్వ ఉంచిన 124 బాక్సుల కర్ణాటక మద్యాన్ని (11,904 టెట్రా ప్యాకెట్‌లు) స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ మహమ్మద్ రిజ్వాన్ బృందాలుగా వెళ్లి సోమవారం ముమ్మరంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. నగరడోణ కొండలో ఉన్న కంకర క్వారీ సర్వే నంబర్ 73లో భారీగా మద్యం లభ్యమైనట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన ఇమాంసాహెబ్ వలి ఉరుసు

మద్దికెర: స్థానిక రైల్వేగేట్ సమీపంలోని హజరత్ ఇమాంసాహెబ్ వలి 322 ఉరుసు జియారత్ కార్యక్రమంతో సోమవారం ముగిసింది. చివరి రోజు నిర్వాహకులు స్వామివారికి పూజలు చేసి చక్కెర చదివింపులు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్లో ప్రత్యేక నిఘా

- సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్య



క్షేత్రగుడి చెక్ పోస్టు వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న నాగ మద్దయ్య

ఆలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఉంచినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ (క్రైం,విజయవాడ) నాగ మద్దయ్య అన్నారు. సోమవారం హాలహర్వి మండలంలోని క్షేత్రగుడి, హొళగుంద మండలంలోని మార్లమడికి వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను ఆయన తనిఖీ చేశారు. కర్ణాటక నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. కర్ణాటక మద్యం, నగదు, ఇతర నిషేధిత వస్తువులు అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. సారా, బెల్టుషాపులపై దాడులు విస్తృతం చేయాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక మద్యం నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాత నేరస్తులపై నిఘా పెంచి వారిపై బైండోర్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకు ముందు ఆలూరు సెబ్ పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట జిల్లా అసిస్టెంట్ సెబ్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్, కర్నూలు సెబ్ డివిజనల్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నరసానాయుడు, ఆలూరు సెబ్ సీఐ సోమశేఖర్ ఉన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రంగస్వామి



బి.రంగస్వామి

పత్తికొండ రూరల్: పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా బి.రంగస్వామి సోమవారం ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆవుల మైరాముడు ప్రకటించారు. అధ్యక్ష స్థానానికి మూడు నామినేషన్లు దాఖలు కాగా ఒకరు ఉపసంహరించుకున్నారు. దీంతో బి.రంగస్వామి, శ్రీనివాస్‌రెడ్డి మధ్య పోటీ నెలకొంది. న్యాయవాదుల ఓట్లు 97 ఉండగా 91 ఓట్లు పోలయ్యాయి. 16 ఓట్ల తేడాతో శ్రీనివాస్‌రెడ్డిపై రంగస్వామి విజయం సాధించారు. న్యాయవాదులు, వాల్మీకి, జర్నలిస్టు సంఘాల నాయకులు రంగస్వామిని అభినందించారు. తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



ఓటు హక్కును వినియోగించుకుంటున్న న్యాయవాదులు

ఇసుక రీచ్ తనిఖీ

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలోని ఇసుక రీచ్‌ను ఆదోని సబ్ కలెక్టర్ నారాయణ శర్మ, మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ సోమవారం తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రీచ్‌లో ఇసుక రవాణ నిలిపివేసినట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



నాగలదిన్నె ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఆస్పరిలో రక్తపు మరకల కలకలం

- డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం పరిశీలన

ఆస్పరి: ఆస్పరిలోని ఆర్‌సీఎం చర్చి వెనుక ప్రాంతం, బొరుగుల బట్టి లోపల పడిన రక్తపు మరకలు కలకలం రేపాయి. ఆదివారం రాత్రి రెండు చోట్ల రక్తపు మరకలు పడడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సోమవారం సంఘటనా స్థలాన్ని ఆస్పరి సీఐ హనుమంతప్ప పరిశీలించారు. అనుమానం ఉండడంతో కర్నూలు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంకు సమాచారం ఇచ్చారు. రక్తపు మరకలు పడిన పరిసరాలను పరిశీలించారు. తొలుత డాగ్ కస్తూర్బా పాఠశాల వెనుక వైపు వెళ్లి, మళ్లీ బొరుగుల బట్టి వద్దకు చేరకుంది. క్లూస్ టీం రక్తపు మరకల నమూనాలను పరీక్ష కోసం ల్యాబ్‌కు తీసుకెళ్లినట్లు సీఐ తెలిపారు. సంఘటనపై పూర్తి సమాచారం లేదని, దీనిపై విచారణ చేస్తున్నామని చెప్పారు. వ్యక్తిపై దాడి చేసి రక్తాన్ని చీపురతో ఊడ్చినట్లు ఉందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



ఆర్‌సీఎం చర్చి పరిసరాల్లో డాగ్ స్క్వాడ్ తనిఖీలు



బొరుగుల బట్టి లోపల రక్తపు మరకలు